ఫిర్యాదులపై నిర్లక్ష్యం వీడాలి

• కలెక్టర్ సంతోష్

గద్వాల, సెప్టెంబర్ 23 : ప్రజా ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి మొత్తం 60ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజాఫిర్యాదులను అధికారులు ఎవరూ పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆయాశాఖల అధికారులకు పంపుతామని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తారన్నారు. ఫిర్యాదులు పరిష్కారం అయిన వెంటనే బాధితులకు సమాచారం అందించాలన్నారు. తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు పరిష్కరించి అక్కడ పరిష్కారం కాని సమస్యలు తమ దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోర్డుపై సంతకం చేస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

: వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 23 : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవితో కలిసి ఆయన ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 87ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారం అందించాలన్నారు.

గాంధీజీ కలలను సాకారం చేయాలి

గాంధీజీ కలలు కన్న పరిశుభ్రమైన భారతావని నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశమంతటా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అందులో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ, సెల్ఫీ సౌండ్ ప్రారంభోత్సవాన్ని ఆయన ప్రారంభించి తొలి సంతకం చేసి సెల్ఫీ దిగారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు వారంలో రెండు గంటల చొప్పున ఏడాదికి 100 గంటలు కేటాయించి , తమ పరిసరాలను శుభ్రపర్చుకొని తద్వారా దేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో తనవంతుగా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను, డీలర్ల సమస్యలు పరిష్కరించాలని పలు డిమాండ్లు అందాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

జయన్న తిరుమలాపురంలో పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించి మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, సెప్టెంబర్ 23 : మండలంలోని జయన్నతిరుమలాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ప్రారంభోత్సవాలతోపాటు భూమి పూజ చేశారు. ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులు, రాంకీ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి.. పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, ఆర్ అండ్‌బీ ఈఈ మల్లయ్య, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఏఎంవో మహానంది, ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు రఘుయాదవ్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, బుచ్చన్న, ప్రవీణ్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పర్వతాలుయాదవ్, గోవర్ధన్ రెడ్డి, ధీరమల్లు, నాగరాజు, బాలీశ్వర్, లోకేశ్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

• దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్త కోట,సెప్టెంబర్ 23 : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సిలిండర్ల ప్రొసీడింగ్స్‌ను, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసే కార్యక్రమాన్ని పట్టణంలో బీపీఆర్ గార్డెన్‌లో నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేది తరువాత కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, కానాయపల్లి ముంపు నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ఎన్‌జె బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి యాదవ్, నరేందర్‌రెడ్డి, సలీంఖాన్, సంద వెంకటేశ్, ముజీఫ్ పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత

మదనాపురం, సెప్టెంబర్ 23 : మహాలక్ష్మి పథకానికి సంబంధిచిన రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. త్వరలోనే మిగిలిన పథకాలను ప్రజలకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్,సెప్టెంబర్23: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి గుండెపోటుతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం దవాఖానకు వెళ్లి బాధితుడు భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 20 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 23: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణిలో 20 ఫిర్యాదులు అందాయని అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్యాభర్తల ఫిర్యాదులు 3, పరస్పర గొడవల ఫిర్యాదులు 3, భూ తగాదాల ఫిర్యాదులు 14 మొత్తం 20 ఫిర్యాదులు అందాయని ఆయన చెప్పారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 23: కేంద్ర ప్రభుత్వం సవరించిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని వనపర్తి ఆర్టీసీ డిపో అధ్యక్షుడు జేవీవీ స్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ప్లకార్డులతో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఇది కార్మిక హక్కులను హరించే విధంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాలు అమలైతే బానిసత్వ పరిస్థితులు ఏర్పడతాయని , చట్టాల రద్దు కోసం దేశవ్యాప్తంగా కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో ప్రచార కార్యదర్శి నాగేశ్వర్, గోవర్ధన్, నర్సింహ, జానకీ ఉన్నారు.

డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

40 ఏండ్ల కిందటి స్థలాలపై ఫిర్యాదు

• బీఆర్ఎస్ నేతపై కక్ష సాధింపు చర్య

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 23 : మల్కిని యాపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 4లోని ఎకరా 23గుంటల ప్రభుత్వ భూమిలో 40 ఏండ్ల కిందట కొందరు నిర్మాణాలు చేపట్టారు. అదే గ్రామానికి గుంటి రాములు, నక్క బుచ్చన్న, పెద్ద నాగన్న, చిన్న నాగన్న తోపాటు పలువురు నిర్మించుకున్నారు. వారితోపాటు ఇటీవల మరికొంద రైదాసరపల్లి గోవర్ధన్‌రెడ్డి, మంచర్ల రాజారెడ్డి, మల్లారెడ్డి, మహ్మద్ సలీం, గొసి యాకోం, నక్క వీరన్న, వట్టె వీరన్న కూడా ఇండ్లు నిర్మించుకొన్నారు. ఇక్కడ నిర్మాణాల తోపాటు స్థలంలో వస్త్రంతండాకు వెళ్లే దారి పక్కన 200గజాల స్థలం మిగిలి ఉన్నదని, ఇక్కడ మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి అనుకూలంగా ఉన్నది. కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు నిర్మించుకున్న ఇంటిని కూలగొట్టి ఆ స్థలంలోనే సమాఖ్య భవనం నిర్మించాలని చెబుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రభుత్వ స్థలంలో ఇండ్లు కట్టుకున్న వారు ఇంత మంది ఉన్నా.. కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుంటి రాములుపై అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు అధికారులకు ఫిర్యాదుల చేసినట్లు తెలిసింది. అయితే అక్కడ నిర్మాణాలు చేపట్టిన వారందరిపై కాకుండా కేవలం రాములుపైనే తాసీల్దార్ పాండునాయక్‌కు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేయడం కక్ష సాధింపు చర్యనే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులపై స్థానిక కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపణలు చేయడం.. అధికారులకు ఫిర్యాదులు చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మాజీ సర్పంచ్ శాంతా సాయులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు గ్రామ కంఠం భూమితో పాటు దళితులకు చెందిన ల్యాండ్‌ను దౌర్జన్యంగా అక్రమించుకొని వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు కౌలు ఇవ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తూ వ్యవసాయం చేస్తున్నారని, దీనిపై కలెక్టర్, తాసీల్దార్, ఆర్డీవో, ఎంపీడీవో స్పందించి ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హద్దులు ఏర్పాటు చేయాలి..

ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని మల్కిమియాపల్లికి చెందిన గుంటి రాములు సోమవారం తాసీల్దార్ పాండుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సర్వేనెంబర్ 4లో ఉన్న ప్రభుత్వ భూమిలో అబ్బాస్ అలీ, నర్సింహులు, భూపతిరెడ్డి, మహ్మద్‌షాన్, బుచ్చన్న, పెద్ద బుచ్చన్న, పాపన్న, వట్టెం బుచ్చమ్మ ఇండ్లతోపాటు ఆలయం ఉన్నదన్నారు. రెండేండ్ల కిందట పల్లె ప్రకృతి వనం కోసం 0.08 గుంటల స్థలాన్ని కేటాయించారన్నారు. తాను 2006లో నక్క బుచ్చన్న ఇంటిని కొనుగోలు చేసి కిరాణం ఏర్పాటు చేసుకోగా.. మిగతా స్థలం తన ఆధీనంలో ఉందన్నారు. రెండేండ్ల కిందట మిగతా స్థలంలో రేకుల ఇల్లు కట్టుకోగా.. దానిని కూల్చి మహిళా మండలి భవనం నిర్మించాలని కొందరు తనపై ఫిర్యాదు చేయించారన్నారు. సర్వేనెంబర్ 4ఏఈలోని 0.10 గుంటల వరకు వ్యవసాయం చేస్తున్నానన్నారు. వస్త్రంతండాకు వెళ్లే దారిలో 200 గజాలకు పైగా ఖాళీగా ఉందని, గ్రామ కంఠ స్థలం 500 గజాలు బీటీ రోడ్డుకు ఆనుకొని ఉందని, ఈ భూమిని వదిలిపెట్టి తనను కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సర్వే నెంబర్ 4తోపాటు కంఠం భూములను సర్వేచేస్తే మహిళా మండలి భవనంతో పాటు గ్రామ అవసరాలకు భవనాలను నిర్మించుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

ఉద్యాన కళాశాల విద్యార్థి అభిలాష్ అభినందిస్తున్న అధ్యాపకులు

రాష్ట్రస్థాయిలో విద్యార్థి ప్రతిభ

పెద్దమందడి, సెప్టెంబర్ 23 : మండలంలోని మోజర్ల ఉద్యానవన కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థి అభిలాష్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ సిక్ట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించాడన్నారు. ప్రతిభ కనబరిచిన అభిలాష్‌ను ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులను సోమవారం అభినందించారు. అలాగే ఓఎస్‌ఏ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ షహనాజ్, డాక్టర్ విద్య, డాక్టర్ గౌతమి, టీచింగ్ స్టాఫ్ ప్రొఫెసర్స్, ఫిజికల్ డైరెక్టర్ మహేశ్, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని ఆహ్వానిస్తున్న ఈవో

అలంపూర్, సెప్టెంబర్ 23 : అలంపూర్‌లో వచ్చే నెల 3వ తేదీ నుండి 12వరకు నిర్వహించే జోగుళాంబదేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ సోమవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కూడా కలిసి ఆహ్వానించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూరు, సెప్టెంబర్ 23: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రేచింతల గ్రామ శివారు ఊకచెట్టు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై నరేందర్ పట్టుకున్నారు. అదేగ్రామానికి చెందిన గొల్లలక్ష్మి , బోరెల్లి తిరుపతమ్మ , బోరెల్లి సురేశ్ చెందిన ట్రాక్టర్లల్లో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. అదేవిధంగా చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ వాగు నుంచి కూడా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు చెందిన ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై చట్ట ప్రకారం కేసులు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికల భవిష్యత్‌కు బాటలు వేయాలి

అయిజ, సెప్టెంబర్ 23 : బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు అందించడంలో ప్రతిఒక్కరి బాధ్యత ఉంటుందని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని హరిహర జూనియర్ కళాశాలలో పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక నేరాలపై ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బాలికలు విద్యపై దృష్టి సారించాలని, శ్రద్ధతో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. వేధింపులు, నిరాధారణకు గురైన బాలికలు, స్త్రీలు నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకొస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేయరాదని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వేధింపులకు గురైన బాలికలు, మహిళలు షీ టీం 8712670312, లేదా 100కు డయల్ చేస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు చర్యలు తీసుకుంటారని వివరించారు. సమావేశంలో ఎస్సై విజయ్‌భాస్కర్, ప్రిన్సిపాల్ శివశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

ఉండవెల్లి, సెప్టెంబర్ 23 : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అలంపూర్ సీఐ రవి బాబువిద్యార్థులకు సూచించారు. ఉండవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోక్స్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో బాలికల ఫిర్యాదుల కోసం పోస్ట్ బాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి శనివారం పోస్ట్ బాక్స్‌ను ఓపెన్ చేసి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి రక్షణ కల్పించడం తోపాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉండవెల్లి ఎస్సైగా మహేశ్..

ఉండవెల్లి ఎస్సైగా మహేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా తాండూరు ఎస్సైగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఉండవెల్లి ఎస్సైగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై శ్రీనివాస్‌నాయక్ గద్వాల హెడ్‌క్వాటర్‌కు అటాచ్ చేశారు.

జీహెచ్‌ఎంల నూతన కార్యవర్గం ఎన్నిక


జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 23 : తెలంగాణ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భానుచంద్రప్రకాశ్, రాజాగంగారెడ్డి హాజరు కాగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈవో పోస్టులను భర్తీ చేయకపోవడం శోచనీయమన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టుల్లో సీనియర్ జీహెచ్ఎంలను నియమించాలని, హైస్కూలుతో కూడా పర్యవేక్షణ చేసే బాధ్యతలను ఎంఈవోలకు అప్‌గ్రేడ్ ఇవ్వాలని, మండలాలకు ఉప విద్యాధికారిని నియమించాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, జిల్లా కోశాధికారిగా శంకరయ్య, గౌరవ అధ్యక్షులుగా ఉమాదేవి, రాష్ట్ర బాధ్యులుగా గణేశ్‌కుమార్, మంజులత, అసోసియేటెడ్ అధ్యక్షులుగా సరస్వతి , బాలరాజు, కరుణాకర్, కాళిదాసు, మహిళ అధ్యక్షురాలిగా నిర్మలాదేవి, విజయవర్ధిని, సహాయ కార్యదర్శులుగా కుర్మయ్య, విష్ణు, భానుప్రకాశ్, రవి, ఆనంద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కృష్ణ, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 23: జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువుపై గొర్రెల కాపరులు మొక్కలు నాటడం అభినందనీయమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావరణ పరిరక్షకులు కృష్ణసాగర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువు కట్టపై గొర్రెల కాపరులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో గతేడాది చెట్లు నాటారని, మేకలు , గొర్రెల వల్ల చెట్లు కొట్టివేసి మేపుతుండడంతో మేక, గొర్రెల కాపరులకు అవగాహన కల్పించి వారితో కొట్టి వేసిన స్థలంలోనే మొక్కలు నాటించినట్లు తెలిపారు. మొక్కలు నరికివేసే చర్యలు ఎక్కడ చేయవద్దని వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

గొర్రెల కాపరులను సన్మానిస్తున్న కృష్ణ సాగర్

కార్యక్రమంలో గొర్రెల యజమాని బాలకిషన్, చిలుక కుమార్, వెంకటేశ్‌సాగర్, లక్ష్మణ్‌యాదవ్ ఉన్నారు.

భూ నష్టపరిహారం విడుదలపై హర్షం

పాన్‌గల్, సెప్టెంబర్23: మండలంలోని శాగాపూర్ గ్రామంలో ఎంజీకేఎల్ఐ డిస్ట్రిబ్యూటరీ-8 కాల్వలో భూములు కోల్పోయిన 30మంది రైతులకు సోమవారం భూనష్టపరిహారం మంజూరు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో రైతులు ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 30మంది రైతులకు చెందిన 13ఎకరాల 14గుంటల భూమి ఎంజీకేఎల్ఐ కాల్వలో కోల్పోవడంతో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లురవి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి 30మంది రైతులకుగాను మొత్తం రూ.74,84,900 డబ్బులు రైతుల ఖాతాలో జమయ్యేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రైతులు కృష్ణయ్య, ముంత రాముడు, తిరుపతయ్య, లక్ష్మయ్య, అయ్యన్న, నాయకులు లక్ష్మయ్య, పెద్ద బాలరాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

అయిజ, సెప్టెంబర్ 23 : మండలంలోని పులికల్ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించాడని కలెక్టర్ సస్పెండ్ చేశారని, తిరిగి ఆయనను విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తులు అదనపు కలెక్టర్ నర్సింగరావుకు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను పులికల్ గ్రామస్తులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు..

రాజోళి, సెప్టెంబర్ 23 : బాలికలు, యువతులు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జగదీశ్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూలో విద్యార్థినులకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భగీరథరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను నడపాలి

చిన్నంబావి, సెప్టెంబర్ 23: ప్రయాణికుల సౌకర్యార్థం కొల్లాపూర్ నుంచి వయా చిన్నంబావి, పెబ్బేరు మీదుగా వనపర్తికి ఆర్టీసీ బస్సులను నడపాలని సీపీఎం మండల కార్యదర్శి కుందెన రాజేందర్‌గౌడ్ అధికారులను డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రానికి వేలాదిమంది ప్రతి రోజూ కొల్లాపూర్ నుంచి ప్రయాణం చేస్తుంటారని, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు పెబ్బేరులో దిగి ఎక్కడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రానికి పోయేటప్పుడు వచ్చేటప్పుడు పెబ్బేరులో వనపర్తి, కొల్లాపూర్ చౌరస్తాలో బస్సులు ఎక్కే సమయంలో రద్దీగా ఉండడంతో ప్రజలు తొందరపాటులో బస్సు టైర్ల కింద పడే ప్రమాదం ఉందని అన్నారు. అధికారులు చొరవ తీసుకొని కొల్లాపూర్ నుంచి చిన్నంబావి, పెబ్బేరు మీదుగా వనపర్తికి బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

కఠినంగా శిక్షించాలి

అమరచింత, సెప్టెంబర్ 23 : తిరుమల తిరుపతి దేవస్థానం మహాప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల నూనె వాడి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన కారకులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక నాయకులు మేర్వరాజు, క్యామభాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసుయాదవ్, అనిల్, రాకేశ్‌శెట్టి ఉన్నారు.

లడ్డూ కల్తీపై చర్యలు తీసుకోవాలి

అయిజ, సెప్టెంబర్ 23 : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు ర్యాలీ నిర్వహించారు. పారదర్శకంగా విచారణ చేసి శిక్షించాలన్నారు.

మార్కెట్‌కు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 23 : రైతులు పండించిన పంటను బాగా అరబెట్టి మార్కెట్‌కు తీసుకొస్తే మంచి ధర లభిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ నల్ల హన్మంత్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌కు వచ్చిన వేరుశనగ, ఆముదం పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో ఏవైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు సహాయ సహకారాలే అందిస్తానని పేర్కొన్నారు. మార్కెట్‌కు 4,790సంచుల వేరుశగ, 210 సంచులు ఆముదాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామేశ్వరమ్మ భర్త కుర్మన్న, డైరెక్టర్లు ఆంజనేయులు, తిరుపతన్న, లలితమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన..

అలంపూర్, సెప్టెంబర్ 23 : లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటస్వామి అన్నారు. సోమవారం మండలంలోని లింగనాయిలోని జెడ్పీ హైస్కూలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.

రిటైర్డ్ వీఆర్ఏలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి

అయిజ, సెప్టెంబర్ 23 : రిటైర్డ్ వీఆర్ఏలకు ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని తాసీల్దార్ జ్యోతిని కోరారు. సోమవారం పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు రిటైర్డ్ వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రిటైర్డ్ వీఆర్ఏలు 2,500 మంది 55 నుంచి 61ఏండ్ల వయసు కలిగిన వారు ఉన్నారని, ఎలాంటి ప్రయోజనాలు అందకుండానే రిటైర్డ్ అయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 600 మంది రిటైర్డ్ వీఆర్ఏలు ఉద్యోగ విరమణ చేశారని, ఉద్యోగ విరమణ చేసిన వీఆర్ఏలకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు అందించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని వివరించారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాషప్ప, కృష్ణయ్య, వెంకటయ్య, విష్ణు, రవికుమార్, కాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్‌ల అందజేత

ధరూరు, సెప్టెంబర్ 23 : ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం నీలహళ్లి గ్రామంలో మహిళలకు పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈరన్న, హన్మంతు, సీనియర్ కార్యకర్తలు సిద్ధిరామప్ప, అంజనప్ప, సవరన్న, జగన్ పాల్గొన్నారు.